# నగరీకరణ సమస్యగా కాకుండా.. అవకాశంగా మలుచుకోవాలి

- 'ఆర్కిటెక్టులు సామాజిక - ఆర్థిక పరిష్కారాలు అన్వేషించాలి'
- వ్యవసాయం నుంచి పరిశ్రమల వైపు మార్పు అవసరం • ఆర్కిటెక్ట్‌ల సదస్సులో మెట్రోరైల్ ఎం.డి. ఎన్.వి.ఎస్. రెడ్డి





ప్రజాపక్షం/హైదరాబాద్ : శరవేగంగా పెరుగుతున్న నగరీకరణ ప్రక్రియను ఒక సమస్యగా కాకుండా దానిని దేశ అభివృద్ధికి ఒక అవకాశంగా చూడాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన అఖిల భారత 'ఆర్కిటెక్చర్ రికనెక్ట్ సమ్మిట్'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ ఆర్కిటెక్చర్ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను ఆయన సందర్శించి, వాటి వినూత్న ఉత్పత్తులు, ఆలోచనలను పరిశీలించారు. అధిక జనాభా, పర్యావరణ సమస్యలు, కాలుష్య నియంత్రణ, వేగంగా పెరుగుతున్న నగరీకరణ వంటి సవాళ్లను ఎదుర్కోడానికి ఆర్కిటెక్ట్‌లు తమ సాంకేతిక పరిజ్ఞానంతో వినూత్న ఆలోచనలు చేయాలని ఎన్‌విఎస్ రెడ్డి సూచించారు. వీటికి సామాజిక, ఆర్థిక కోణంలో సాంకేతిక పరిష్కారాలను అన్వేషించాలన్నారు. నగరీకరణ గణనీయంగా పెరుగుతుంటే రవాణా పరమైన సమస్యలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయన్నారు. అందుకు దీటుగా ఆర్కిటెక్టులు, నిర్మాణ రంగ నిపుణులు తగిన పరిష్కారమార్గాలను శోధించాలన్నారు.

## వ్యవసాయం నుంచి పరిశ్రమల వైపు మార్పు అవసరం

భారత జనాభాలో అధిక భాగం ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి ఉందని ఆయన గుర్తుచేశారు. చైనాను ఉదాహరణగా చూపుతూ, వ్యవసాయం నుంచి పరిశ్రమలకు పెద్ద ఎత్తున కార్మిక శక్తిని మళ్లించడం ద్వారా జిడిపి వృద్ధి వేగవంతం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మార్పులో నగరీకరణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## కొత్త ఆవిష్కరణలతో మెట్రోకు ఆధరణ..

పటిష్టమైన ప్రజా రవాణా వ్యవస్థలు మాత్రమే ట్రాఫిక్ రద్దీకి దీర్ఘకాలిక పరిష్కారమని ఎన్‌విఎస్ రెడ్డి అన్నారు. మహిళల భద్రత, శక్తి సామర్థ్యం, సౌకర్యవంతమైన ప్రయాణం కారణంగా హైదరాబాద్ మెట్రో ప్రజాదరణ పొందిందని వివరించారు.హైదరాబాద్ మెట్రో రైల్ ప్రజా రవాణా వ్యవస్థగా అత్యంత ఆదరణ పొందడానికి అనేక కొత్త ఆవిష్కరణలేకారణమన్నారు.

## ఆధునిక సాంకేతికత - భారతీయ సంప్రదాయాల కలయిక..

ఆర్కిటెక్టులు ఆధునిక సాంకేతికతను భారతీయ సంప్రదాయ డిజైన్ సిద్ధాంతాలతో కలిపి, పర్యావరణహిత విధానాలను వినియోగించాలని సూచించారు. ప్రస్తుతమున్న సాంకేతిక, డిజిటల్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకుంటూనే, సంప్రదాయంగా వస్తున్న సహజ సిద్ధమైనభావనా నిర్మాణ సూత్రాలను జోడించి, ప్రజల జీవన విధానాన్ని మరింత సులభతరం చేయడంలోఆర్కిటెక్ట్‌లు తగిన మార్గాలపై దృష్టి సారించాలన్నారు.

## ఆహ్లాదకరమైన ప్రదేశాలు లేకపోవడంతోనే పెరుగుతున్న నేరాల సంఖ్య..

నగరాలలో ఎక్కువగా ఉన్న పేదరికం, సరైన గృహ సదుపాయాలు లేకపోవడం, ఆహ్లాదకరమైన బహిరంగ ప్రదేశాలు లేకపోవడం వల్ల నేరాల సంఖ్య పెరుగుతోందని ఎన్‌విఎస్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. అందువల్ల గృహ నిర్మాణ రంగం అందరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన పార్కులు, బహిరంగ ప్రదేశాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. ఇందుకు ఉదాహరణగా కొలంబియాలో ఉన్న బొగొటా నగరం గురించి ప్రస్తావిస్తూ, అద్భుతంగా సాధించిన ఆ నగరం అభివృద్ధి గాథను స్ఫూర్తివంతంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

## నీటి సంరక్షణపై దృష్టి సారించాలి..

పట్టణాలు వేసవిలో నీటి ఎద్దడి, వర్షాకాలంలో వరద నీటి ముంపు వంటి తీవ్ర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. వీటికిఆర్కిటెక్ట్‌లు తగిన పరిష్కార మార్గాలు అన్వేషించాలన్నారు. సింగపూర్ వర్షపు నీరు సేకరణ విధానాన్ని ప్రస్తావిస్తూ, భూగర్భ జలాల స్థాయిని పెంచేలా వర్షపు నీటి నిల్వ వ్యవస్థలు ప్రతి పట్టణ ప్రాజెక్టుల్లో తప్పనిసరిగా అంతర్భాగం చేయాలని ఆయన సూచించారు.

## ట్రాన్సిట్ - ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం..

నగరాలలోమెట్రో మార్గాల వెంట బహుళ అంతస్తుల నివాస గృహాలను, వాణిజ్య సముదాయాలను, విద్యాసంస్థలు ఏర్పడితే వాహనాలపై ఆధారపడకుండా ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంపై దృష్టి పెట్టాలన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ వ్యవస్థలో అటువంటి చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. తాముచేపట్టిన ఇంధన పొదుపు, పర్యావరణ హిత చర్యల వల్ల హైదరాబాద్ మెట్రో అనేక అంతర్జాతీయ, జాతీయ పురస్కారాలను గెలుచుకుందన్నారు.